RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 251 పేజీలు - 08 గురువారం 06 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ



2లో.

## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..



తుమ్మడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

అటవీ పర్యావరణ అనుమతలుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 5:** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 5:** ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం **మిగతా 2లో...**



## తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

డయల్ 112తో అన్ని సేవలు

ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు

హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ

కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం

సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు

ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో

అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి




2లో.

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన

సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య

ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం

ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.



## రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

: కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

**తొలి అక్షరం/అమరావతి,ఆగస్టు 5:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని **మిగతా 2లో...**



## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..




8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

నకిలీ ఎన్‌ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు

పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 5:** హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (చీూజ) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను **మిగతా 2లో...**

## 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 5:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత **మిగతా 2లో...**

## రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**తొలి అక్షరం/ముంబై, ఆగస్టు 5:** జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు **మిగతా 2లో...**



## అమెరికాలో భారతీయుల ఘనత..

'ఇండియా డే'గా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!

ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన

బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డే'గా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 5:** అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం **మిగతా 2లో...**



# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

**మొదటి పేజీ తరువాయి**

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.
గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

# అమెరికాలో భారతీయుల ఘనత..

**మొదటి పేజీ తరువాయి**

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్-అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై 'ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్' (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

**మొదటి పేజీ తరువాయి**

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 5:**
తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..

**మొదటి పేజీ తరువాయి**

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

**ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:**
శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట,రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర,ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి,మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి, వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

# 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

**మొదటి పేజీ తరువాయి**

ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

**మొదటి పేజీ తరువాయి**
150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్బీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

**తొలి అక్షరం/అమరావతి,ఆగస్టు 5:**
ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. "పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో 'కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు' అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం" అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.
ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం" అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. "కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. "ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ స్టేడియంలో మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. 'సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను' అని ప్రతి బిడ్డ నమ్మాలి" అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

**రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ**

**ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి**

**ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు**

**ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన**

**దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 5:**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది.
రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.
స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.
ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.
మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.
అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.
జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

**మొదటి పేజీ తరువాయి**
ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఫీఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# ముత్యాలమ్మ తల్లికి బోనాలు

● సమర్పించిన కౌన్సిలర్‌లు, మణిరాజ్ మిత్ర బృందం



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 5:** తొర్రూర్ పట్టణ ముత్యాలమ్మ పండగ సందర్భంగా ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించిన తొర్రూర్ కౌన్సిలర్లు. కౌన్సిలర్లు భూసాని ఉప్పలయ్య జయమ్మ, తూర్పాటి రవి,పేర్ల జంపా, మాడుగుల భవానీ లత, అల్లం శ్యామల, కిన్నెర. కవితా సతీష్, కర్నే నాగరాజు, పద్మ కిషన్ నాయక్, చకిలేల. అలివేణి నాగరాజు తల్లికి బోనం సమర్పించి పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని,తల్లిని, కోరుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు చకిలేల. మణిరాజ్, నిమ్మల శేఖర్, మారోజు నరేష్, గొల్లపల్లి సత్తయ్య మరియు మిత్ర బృందం పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● రైతుల సమక్షంలోనే పారదర్శకంగా భూ రీ సర్వే నిర్వహిస్తాం ● రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భద్రత కలుగుతుంది ● పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామసభలో భూ రీ సర్వే పై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్





**తొలి అక్షరం/ఖమ్మం, ఆగస్టు- 05 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను పూర్తిగా పరిష్కరించి శాశ్వతమైన, పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ రీ-సర్వే పై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పాల్గొని రైతులకు, గ్రామ ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజలు భూ సర్వే పై అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామంలో ముందుగా రెవెన్యూ గ్రామ సరిహద్దులను పూర్తిగా ఖరారు చేస్తున్నామని, అనంతరం ప్రభుత్వ భూములు, భూసేకరణ జరిగిన ప్రాంతాలు, ఇతర ప్రత్యేక భూములను గుర్తించి వేరు చేస్తున్నామని వివరించారు. తరువాత మాత్రమే వ్యవసాయ భూములు, రైతుల వ్యక్తిగత భూములను క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో కొలిచి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, ఆన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని తెలిపారు. కొంతమందికి తక్కువ విస్తీర్ణం నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని చెప్పారు.ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నేలకొండపల్లి తహసీల్దారు రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# రెండు గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లికి పట్టువస్త్రాలుఅనిల్ గౌడ్ దంపతులు

**ఎర్రబెల్లిగూడెం ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పించిన బత్తిని అనిల్ గౌడ్ దంపతులు**

**రామానుజపురంలో బోనాలతో ప్రత్యేక పూజలు.. బీఆర్ఎస్ నాయకుల పాల్గొనిక**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 5:** నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎర్రబెల్లిగూడెం ముత్యాలమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా మాజీ ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిని అనిల్ గౌడ్, ఆయన సతీమణి కృష్ణవేణి దంపతులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, గ్రామాలు సస్యశ్యామలంగా వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గజ్జి అశోక్‌వార్డ్ నెంబర్ శైలం శ్రావణి రాజ్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తమ స్వగ్రామమైన రామానుజపురంలోనూ ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి పట్టువస్త్రాలు అర్పించారు. రెండు గ్రామాల్లోనూ భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

**జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్**

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**






**తొలి అక్షరం/ఖమ్మం, ఆగస్టు- 05 :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయని, పోలింగ్ స్టేషన్ వారీగా డిజిటలైజేషన్ నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక పరిశీలనలో జిల్లాలో 95,740 మంది ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు, 33,134 మంది మరణించినట్లు గుర్తించామని తెలిపారు. 42,814 మంది ఓటర్లు మ్యాపింగ్ పూర్తి కాలేదని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని తెలిపారు. ఆగస్టు 10, 2026 నాటికి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 19 క్రొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ స్టేషన్లను వీలైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు,జి.సూర్య నారాయణ, బీ.ఆర్.ఎస్. ప్రతినిధులు ఎం.రమేష్, బి వేణుగోపాల్, సిపిఎం డి.తిరుపతి రావు, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, ఆప్, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● పే స్కేల్ అమలు, పెండింగ్ వేతనాల విడుదల కోరుతూ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌కు వినతి



**తొలి అక్షరం/నర్సింహులపేట ఆగస్టు 5:** గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పనుల అమలులో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (వి బి జి రామ్ జి )ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రాంచంద్రు నాయక్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు పే స్కేల్ అమలు చేయడంతో పాటు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ తమ సేవలను ప్రభుత్వం ఇప్పటికీ క్రమబద్ధీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తగిన వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే డా. జాటోత్ రాంచంద్రు నాయక్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు నరేష్, సావిత్రి, శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దరన్న ప్రజా పోరాటాల చిరస్మరణీయ యోధుడు: మురళి సింగర్

**మూడో వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**ఆయన పాటలు తరతరాలకు పోరాట స్ఫూర్తినిస్తాయని వ్యాఖ్య**

**తొలి అక్షరం ఇనుగుర్తి, ఆగస్టు 5:** తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో ప్రజా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న మూడో వర్ధంతి సందర్భంగా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు మురళి సింగర్ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మురళి సింగర్ మాట్లాడుతూ, “గద్దరన్న గజ్జె కట్టి అడుగు వేస్తే నేలమ్మ పులకరించిపోయేది. ఆయన గొంతు విప్పి పాట పాడితే పాలక వ్యవస్థ పునాదులే కదిలిపోయేవి. ఆయన పాట ఒక తూటా... ఆయన అడుగు ఒక విప్లవ పూబాట. ఎర్రజెండా నీడలో ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు గద్దరన్న. కష్టజీవుల కన్నీటికి తన పాటతో ప్రాణం పోసిన మహాకవి. శ్రమజీవుల చెమటకు స్వరం ఇచ్చి, హక్కుల పోరాటాలకు ఊపిరి పోసిన యోధుడు. గద్దరన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రతి గుండె చప్పుడులో ఆయన పాట నేటికీ మారుమోగుతూనే ఉంది. ఆయన ఆశయాలు, ప్రజల పట్ల అంకితభావం, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ చెరగని చరిత్రగా నిలుస్తాయి. ప్రజా యుద్ధనౌక ప్రయాణం ఎన్నటికీ ఆగదు“ అని అన్నారు.గద్దరన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని మురళి సింగర్ పిలుపునిచ్చారు.



# జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు దుడిమెట్ల రాజమౌళి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్.



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 5:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దుడిమెట్ల రాజమౌళి జన్మదినవేడుకలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదాడి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, విచ్చేసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రెడ్లవాడ గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల రాజు జిల్లా ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ పిట్టకాలబోడ్ తండా కాంగ్రెస్ నాయకులు బానోత్ వీరన్న (చిన్న )మందుల కవిరాజ్ బానోతు శ్రీకాంత్ రెడ్లవాడ మాజీ ఎంపీటీసీ మాలోత్ రవి వార్డ్ మెంబర్ బాదావత్ సునీత నరసింహ బాదావత్ వెంకట్రాం పాల్గొన్నారు.

# ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఉద్యమకారుల ఫోరం నాయకులు





**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 5:**వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించిన ఉద్యమ నేత కుటుంబాన్ని పరామర్శించడానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలిరాగా ఉద్యమ నాయకునికి నివాళు లు అర్పించిన తదనంతరం కుటుంబాన్ని పరామర్శించి ప్రెస్మీట్లో డాక్టర్ చీమ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక గొప్ప ఉద్యమనేతను కోల్పోయామని ఉద్యమకారులకు తీరని లోటని పెద్ది సుదర్శన్ రెడ్డి లేని లోటు తీర్చలేనిదని తన నియోజకవర్గంలోని మెడికల్ కళాశాలకు పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు వరంగల్ ఖమ్మం కరీంనగర్ జిల్లాల నుండి ఉద్యమకారుల ఫోరం నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఘనంగా నివాళులర్పించి తన కుటుంబాన్ని ఉద్యమకారులు భారీ ఎత్తున తరలివచ్చి పరామర్శించారు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసి తన కుడి కన్నును కోల్పోయినప్పటికీ శరీరమంతా గాయాలపలైనా కూడా లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు లేకపోవడం ఈ రాష్ట్రంలోని ఉద్యమకారులు అందరికీ తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు తన కుటుంబానికి ఉద్యమకారులు అండగా ఉంటారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుండు దయానంద్ మహిళా ఉపాధ్యక్షురాలు దుగ్యాని శ్యామల గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ జగన్ సీనియర్ నాయకులు కొండ స్వామి టాప్ టీవీ నిర్వాహకులు భాస్కర్ సీనియర్ ఉద్యమ కారులు రజనీకాంత్ జయ మల్లమ్మ పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ ఇంకుడు గుంతలతోనే సాధ్యం

**● భూగర్భ జల నీటిమట్టాన్ని పెంపొందించే చర్యలు చేపట్టండి ● ముదిగొండ మండలం యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో బైక్ పై ప్రయాణించి సామాజిక ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**తొలి అక్షరం/ఖమ్మం, ఆగస్టు- 05 :** వర్షపు ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం మధిర నియోజకవర్గం మదిగొండ మండలం యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ బైక్ పై ప్రయాణించి పంట పొలాల్లో నీటి కుంట లు, పంట కుంటలు, ఊట కుంటలు, గ్రామంలో నిర్మించే సామాజిక ఇంకుడు గుంతలు, ఫాం పాండ్, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వర్షపు ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఊట కుంటలు (పర్కొలేషన్ ట్యాంకు లు), పంట కుంటలు (ఫార్మ్ పాండ్స్), బోర్వావుల రీఛార్జ్ నిర్మాణాలను విస్తృ తంగా చేపట్టాలని ఆదేశించారు. ఫార్మ్ పాండ్స్ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని, అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్స్, బోర్ బావుల రీచార్జ్ పనులు చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు బోర్ బావుల రీచార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాల పెంపు, నీటి వృథా నివారణపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో అధికారులు స్థానిక సర్పంచ్ ఇతర వార్డు సభ్యులు, ఎల్నినో వాతావరణ పరిస్థితుల గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతీ గ్రామపంచాయతీలో నిర్దేశిత లక్ష్యం మేరకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సరైన పంట విత్తనాలు ఎలా ఎంపిక చేసుకోవాలో రైతులకు వివరించాల న్నారు. వాన నీటి సంరక్షణ చర్యలలో భాగంగా పంట కుంటలు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ప్రజలు, రైతులకు తెలియ జేయాలన్నారు. వర్షపు నీటిని సంరక్షిం చుకునే పద్ధతులను విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుం డా చేపట్టే చర్యలలో భాగంగా ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రక్కన నూతనంగా నిర్మిస్తున్న వీఓ భవనం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ముదిగొండ తహసీల్దారు రవి కుమార్, ఎంపిడివో విజయ, గ్రామ సర్పంచ్ చెరుకుపల్లి స్వాతి, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.


# ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులతో సమావేశం



**తొలి అక్షరం/హైదరాబాద్, ఖమ్మం ప్రతిని,ఆగస్టు 8:** ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులతో బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మట్ట రాగమయిదయానంద్, ఖమ్మం డీసీసీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో త్వరలో ఖాళీ కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై విస్తృతంగా చర్చించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సంబంధిత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తున్న నేపథ్యంలో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశావహుల వివరాలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పేర్లను పీసీసీకి పంపించాలని సమావేశంలో నిర్ణయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆశావహుల వివరాలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన వారి వివరాలను పీసీసీకి పంపాలని నిర్ణయం

# తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

**- తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన వైస్ ఉపసర్పంచ్ జి. ప్రవీణ్**




**తొలి అక్షరం/రఘునాథపాలెం ఆగస్టు 5:** జాతీయ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా వెంకటాయపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ వైస్ సర్పంచ్ జి. ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని అన్నారు. శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు, మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో అవసరమని తెలిపారు. తల్లులు అపోహలకు లోనుకాకుండా వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, సరైన పోషకాహారం, శిశు సంరక్షణపై వివరించారు. అనంతరం తల్లులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువులో రాణించాలి

**● ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలి ● ఖమ్మం నగరంలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**తొలి అక్షరం/ఖమ్మం, ఆగస్టు- 05 :** విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధి రాజేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానం, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనీ ఫామ్స్ ప్రతి విద్యార్థికి అన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలని అన్నారు. సమయాన్నీ వృదా చేయకుండా ఉన్న సమయాన్నీ వినియోగించుకుంటూ చదువుతో పాటు క్రీడలలో శ్రద్ద కనబర్చి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ హితబోధ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# మూసినా ఉపేంద్ర పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి

**- ఘటించిన నెక్కొండ మండల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్**



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 5:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన మూసినా మాధవ్ తల్లి గారైన మూసినా ఉపేంద్ర అనారోగ్యం తొ మరణించగా వారి పార్థివాదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ రెడ్లవాడ పి ఎ సి ఎస్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లావుడియా తిరుమల్ చౌహన్, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ,సొసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు షైక్ షబ్బీర్ మహ్మద్ అన్వర్,మూసినా శ్రీనివాస్, మూసినా సారయ్య వార్డు సభ్యులు రావుల మధుకర్ రెడ్డి చల్లా విష్ణు రెడ్డి ముద్రబోయిన శ్రీకాంత్,కక్కెర్ల ఐలయ్య రామాలయం కమిటీ డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్ రావు రామరాపు రాములావుల భాస్కర్ రెడ్డి తాళ్లపెల్లి చెన్నకేశవులు, భాస్కర్ నేతుల సారంగం గడ్డం వెంకన్న తదితరులు పార్థివాదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కుంభకోణం

**- విచారణ జరపాలని డిమాండ్, ఖమ్మం బిజెపి టూ టౌన్ అధ్యక్షులు వెంకటనారాయణ**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 5:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (ఖవీజ)లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని గత రెండేళ్లుగా కార్పొరేషన్ ఈ ఆఫీసు వ్యవస్థను పూర్తిగా నిలిపివేసి, అన్ని పనులను మ్యానువల్ విధానంలో చేయడం ద్వారా కోట్ల రూపాయల మేరకు అక్రమాలు జరిగాయని,మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి పని, ప్రతి ఫైలు కార్యాలయంలోనే జరుగుతున్నప్పటికీ, గత రెండేళ్లుగా, ఈ ఆఫీసు వ్యవస్థను పూర్తిగా డిసేబుల్ చేశారని, దీనివల్ల అధికారులు, సిబ్బంది తమకు ఇష్టం వచ్చినట్లు బిల్లులు రాసుకుంటున్నారని, ఫైళ్లను దాచిపెడుతున్నారని, మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని విభాగాల్లోనూ ఈ-ఆఫీసు వ్యవస్థను నిలిపివేయడం ద్వారా, టెండర్లు లేకుండానే కోట్ల రూపాయల మేరకు నిధులను దుర్వినియోగం చేశారని , ఇది ప్రజల పన్ను డబ్బుల దుర్వినియోగంగా పరిగణించబడుతోంది. ఈ అవినీతిలో భాగంగా, లక్ష రూపాయల లోపు ఉన్న అనేక బిల్లులను తీసినట్టు తెలుస్తుందని, లక్ష రూపాయల లోపు ఉన్న అన్ని బిల్లులపై తక్షణమే విచారణ జరపాలని, వాటిలో అవినీ తి జరిగిందని, వాటిని కూడా విచారించాలని డిమాండ్ చేశారు మున్సిపల్ కార్పొరేషన్‌ను డిజిటల్ చేయడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని, ఈ నిధులతో ఈ-ఆఫీసు వ్యవస్థను ఏర్పాటు చేశారని, కానీ ఇప్పుడు ఆ వ్యవస్థను పూర్తిగా నిలిపివేయడం ద్వారా ఆ కోట్ల రూపాయల నిధులు వృథా అయ్యాయి. ఇది ప్రజల పన్ను డబ్బుల దుర్వినియోగంగా పరిగణించబడుతోంది. ఈ అవినీతిలో కొంతమంది కాంట్రాక్టర్లు, మాజీ కార్పొరేటర్లు,ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసి, కోట్ల రూపాయల మేరకు నిధులను దోచుకున్నారని,ఈ అవినీతిపై తక్షణమే సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) లేదా లోకాయుక్త విచారణ జరపాలని, బాధ్యులపై చర్య తీసుకోవాలని తెలిపారు

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా.. ఆరు నెలలు తల్లిపాలే శ్రేష్ఠం






**- పనికర అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన**



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలో నవజాత శిశువుకు పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) ఇవ్వడం అత్యంత అవసరమని, జీవితంలోని తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే శిశువుకు ఉత్తమ ఆహారమని అంగన్వాడీ సూపర్వైజర్ నజ్మా అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు. కొందరు తల్లులు సౌందర్యం దెబ్బతింటుందనే అపోహతో బిడ్డలకు తల్లిపాలు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని, ప్రతి తల్లి తన బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడం ద్వారా జీవితానికి ఆరోగ్యకరమైన పునాది పడుతుందని, తల్లిపాలను ప్రత్యామ్నాయంగా ఏ ఆహారమూ భర్తీ చేయలేదని ఆమె స్పష్టం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు సింగం రాజు తన కూతురు కి అన్నప్రాశన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అరుణకుమారి, ఆయా ఉపేంద్ర, గర్భిణులు, సృజన ,రాజేశ్వరి, శరణ్య, యాభలక్ష్మి, శ్రీలత, రజిత, అలివేలు, శ్రావణి, సరిత, ఆశ వర్కర్ చెరుకు రేణుక, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పిట్ట కాల్ బోర్డ్ తండా గ్రామం లో మల్లారెడ్డి కుంట తూము రిపేర్ ప్రారంభించిన పిట్ట కాల్ బోర్డ్ తండా సర్పంచ్ బాదావత్ సూర్య నాయక్.



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని పిట్టకాల బోర్డు తండా గ్రామంలో మల్లారెడ్డి కుంట చెరువు కట్ట తూము రిపేర్ చేయడానికి గ్రామస్తులు మరియు గ్రామ సర్పంచ్ ఓపెనింగ్ చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ సూర్య నాయక్ ఉపసర్పంచ్ రాము వార్డ్ నెంబర్ సత్య కిరణ్ భానోతు వీరన్న, రమేష్ సతీష్ మామోజీ వీరన్న, సుధాకర్ ధరావత్ రమేష్,మేస్త్రి మచ్చ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు బరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి





**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 5:** నకిరేకల్ శాసనసభ్యులు తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం సహాయ సహకారంతో మంజూరైనటువంటి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రామన్నపేట మండలం వివిధ గ్రామాల చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ వార్డు సభ్యులు మోటే మహేష్ కందుల అండాలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ అంజిరెడ్డి అక్క యాదయ్య పిట్ట రామిరెడ్డి శంబాల వెంకన్న చింతల కృష్ణ గొలుసుల ప్రసాద్ మాల్గా వెంకటేష్ బండ బాలరాజ్ బొడ్డు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున పాఠశాలలో రంగుల సందడి

## రెడ్ కలర్ డే... బోనాల ఉత్సవాల వైభవం

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 5:** రామన్నపేట మండల కేంద్రంలోని నాగార్జున పాఠశాలలో విద్యార్థుల సమగ్ర వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహించిన ఎరుపు రంగు దినోత్సవం మరియు బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. ప్రీ-ప్రైమరీ విద్యార్థుల కోసం నిర్వహించిన ఎరుపు రంగు దినోత్సవంలో చిన్నారులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎరుపు రంగుకు సంబంధించిన పండ్లు, పూలు, బొమ్మలు మరియు వివిధ వస్తువులను పరిచయం చేస్తూ ఉపాధ్యాయులు రంగుల ప్రాముఖ్యతను సులభంగా వివరించారు. పాటలు, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా చిన్నారులలో రంగుల గుర్తింపు, ఆత్మవిశ్వాసం మరియు అభ్యాసంపై ఆసక్తిని పెంపొందించారు. ప్రాథమిక విద్యార్థుల కోసం నిర్వహించిన బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఘనంగా




నిర్వహించబడ్డాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. బోనాల పండుగ విశిష్టత, సాంస్కృతిక విలువలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. **విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించాలి - ప్రిన్సిపాల్ ఎన్.రేఖ** నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొని విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖ మాట్లాడుతూ,



"విద్యార్థులకు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు మరియు నైతిక విలువలను చిన్ననాటి నుంచే పరిచయం చేయడం ఎంతో అవసరం. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి ఆనందంగా నేర్చుకుంటూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని మా పాఠశాల నిరంతరం కృషి చేస్తోంది" అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ డా. నాగరాజు ,ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జలసిరి ప్రోగ్రాంపై ప్రజల్లో అవగాహన కల్పించిన కంచి. మధుసూదన్ సర్పంచ్ శోభనాద్రిపురం





**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 5:** రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామం లో సర్పంచ్ కంచి మధుసూదన్ ఆధ్వర్యంలో గ్రామం లో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించి,4 రకాల చెత్త వేరు చేసే ప్రక్రియ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది,అదే విధంగా ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని,తద్వారా భూగర్భ జలాన్ని పెంచుకోవాలని,పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా ఉంటాయని ప్రజలకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్,పంచాయతీ పాలక వర్గ సభ్యులు,గ్రామ లైన్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# యూత్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి రోజు క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్ దీన్‌దయాళ్ నగర్ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న యూత్ కమ్యూనిటీ హాల్‌కు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కాలనీకి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు,యువకులు,మహిళలు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ...25 ఏళ్లుగా దీన్‌దయాళ్ నగర్ కాలనీవాసులు ఎదురుచూస్తున్న కమ్యూనిటీ హాల్ కల నేడు సాకారమైందని అన్నారు.కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా కమ్యూనిటీ హాల్ లేక సామాజిక,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురాగానే వెంటనే రూ.25 లక్షల నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని దీన్‌దయాళ్ నగర్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు,సైడ్ డ్రైనేజీలు,ఇతర మౌలిక సదుపాయాలను కల్పించామని,ప్రజలకు అవసరమైన



ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.యువతకు సామాజిక,విద్యా,సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఈ యూత్ కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్న ఎమ్మెల్యే,భవిష్యత్‌లో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని చేపడతామని హామీ ఇచ్చారు.హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా వాటిని చేతల్లో చూపిస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని,గత రెండున్నర సంవత్సరాల్లో నియోజకవర్గంలో సుమారు 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు.వందల కోట్ల రూపాయలతో రోడ్లు,డ్రైనేజీలు,కమ్యూనిటీ భవనాలు,ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.గత పదేళ్లలో చేపట్టని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రతి డివిజన్ అభివృద్ధే తమ లక్ష్యమని, ముఖ్యంగా కాలనీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు.దీన్‌దయాళ్ నగర్ కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇంటి నెంబర్ల సమస్య పరిష్కారానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.కాలనీ ఎఫ్‌టీఎల్ (ఖీూ) పరిధిలో ఉండటం వల్ల కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని,అయితే ప్రభుత్వం ఈ అంశంపై అత్యంత సీరియస్‌గా దృష్టి సారించి చట్టపరమైన పరిష్కారం ద్వారా కాలనీవాసులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి అర్హత గల కుటుంబానికి స్వంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.ఇప్పటికే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సుమారు మూడు వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేశామని గుర్తు చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి రోజు తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తూ,వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బట్టి శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ నెక్కొండ కిషన్,మామిళ్ల రాజు, మామిండ్ల సురేష్,50వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ పాషా,స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,యువజన నాయకులు, మహిళలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓబీసీ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

## - కేంద్ర ప్రభుత్వం బీసీల కులగణన చేపట్టాలి



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఆగస్టు 7న, బెంగుళూరులో జరిగే ఓబీసీ మహాసభ పోస్టరు ను హన్మకొండ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 55% ఉన్న బీసీల లెక్కలు కేంద్ర ప్రభుత్వం చెప్పట్టాలని అని అన్నారు.కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చెయ్యాలని,బీసీ జనాభా దమాషా ప్రకారం అన్ని రంగాలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలకు న్యాయం చేయాలని కోరారు.రాష్ట్రము లో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చెప్పట్టి బీసీల లెక్కలు తేల్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపిస్తే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుంది అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సమస్యల సాధన కోసం సానుకూలంగా ఉంది అని అన్నారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమము బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్,బీసీ విద్యార్థి సంఘం కాకతీయ ఇంచార్జ్ అరగంటి నాగరాజ్ గౌడ్,బీసీ యువజన సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు గొట్టే మహేందర్,బీసీ సంఘం నాయకులు ముత్యాల సాయి,కందికొండ తిరుపతి,శనిగరపు సుమన్,రాజశేఖర్,చాగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో ఖాదీ,గ్రామీణ పరిశ్రమల-ప్రజా విద్యా కార్యక్రమం విజయవంతం

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కిట్స్ వరంగల్ క్యాంపస్ లో ఖాదీ,గ్రామీణ పరిశ్రమల-ప్రజా విద్యా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్, వరంగల్ (కిట్స్‌డబ్ల్యు) కు చెందిన 'లిటరరీ అండ్ ఎక్స్‌ట్రామ్యూరల్ క్లబ్', 'స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల (ఎస్ వి బి సి) క్లబ్'తో కలిసి,ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కే వి ఐ సి) వారి 'ప్రజా విద్యా కార్యక్రమం'లో భాగంగా వ్యాసరచన,ఉపన్యాస పోటీలను కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి, మహబూబ్ నగర్,రంగారెడ్డి,హైదరాబాద్ఎమ్మెల్సీ,చైర్‌పర్సన్,వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్,తెలంగాణ,సురభి వాణిదేవి మాట్లాడుతూ...ఖాదీ గ్రామోద్యోగమిషన్ ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం,విద్యార్థులలో ఖాదీ,గ్రామీణ వ్యవస్థాపకత,గాంధేయ సిద్ధాంతం,స్వావలంబన, గ్రామ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాల గురించి అవగాహన కల్పించడం,అలాగే సమర్థవంతమైన భావప్రసారం,విమర్శనాత్మక ఆలోచన,సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహించడం.ఈ కార్యక్రమంలో సంస్థలోని వివిధ విభాగాల నుండి 155 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు,సహజంగా ఉండండి,సంక్లిష్టంగా లేదా కృత్రిమంగా ఉండకండి అని తెలిపారు.గౌరవ అతిథి గా విచ్చేసిన తెలంగాణ




కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ లంకా మనోజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జీవితంలో వారానికి కనీసం ఒక్కసారైనా ఖాదీ దుస్తులు ధరిస్తారని నొక్కి చెప్పారు.చిన్న తరహా పరిశ్రమల ప్రాముఖ్యత,వాటి ద్వారా లభించే అవకాశాల గురించి ఆయన వివరించారు. అంతేకాకుండా,వ్యర్థాల నుండి ఆరోగ్య ఉత్పత్తులు,కుండల తయారీ,జీవవిచ్ఛిన్నమయ్యే పదార్థాలు,ఆహార పదార్థాలు,తేనె తీయడం,చింతపండు పరిశ్రమ,పసుపు పొడి పరిశ్రమ మరియు ఖనిజ ఆధారిత పరిశ్రమలను కూడా ఆయన పరిచయం చేశారు.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం,కేంద్ర ప్రభుత్వ సెమీకండక్టర్ విధానం లక్ష్యాలకు అనుగుణంగా'ఈ సివి-విఎల్ఎస్ఐ (డిజైన్ & టెక్నాలజీ)' అనే కొత్త బి.టెక్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాము.ఈ కార్యక్రమంలో సంస్థలోని వివిధ విభాగాల నుండి 155 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పోటీలు విద్యార్థులకు గ్రామీణాభివృద్ధి,దేశ నిర్మాణంపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి ఒక వేదికను అందించడంతో పాటు,వారి ప్రసంగ,రచనా నైపుణ్యాలను మెరుగుపరిచాయి అని తెలిపారు.ఈ సందర్భంగా కిట్స్ వరంగల్ ఉపాధ్యక్షులు వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్' కార్యదర్శి అయిన వొడితల కిషన్ రావు అధ్యక్షోపన్యాసం చేశారు.సాంప్రదాయ రంగాలకు చెందిన 'డిగ్ని-టీ' వంటి కార్యక్రమాల వైపు విద్యార్థులు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన సూచించారు.ఎం ఎస్ ఎం ఈ-ఎస్ ఎఫ్ యూ ఆర్ టి ఐ పథకాల కింద,వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించే స్టార్టప్‌లకు ఖాదీ ప్రాజెక్టుల ద్వారా 2.5 నుండి 5 కోట్ల రూపాయల వరకు నిధులు సమకూర్చడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎ సి అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్,కేవిఐసి సీనియర్ ఎగ్జిక్యూటివ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.లతాదేవి,కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్ రెడ్డి,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి,స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె. శ్రీధర్; అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ డబ్ల్యు. గ్రేస్ శాంతి (అసిస్టెంట్ ప్రొఫెసర్,ఎం&హెచ్ విభాగం),డాక్టర్ కె.రాజేంద్ర ప్రసాద్ (అసిస్టెంట్ ప్రొఫెసర్,గూణ)కె.గౌతమ్ రాజు (అసిస్టెంట్ ప్రొఫెసర్,ఖు విభాగం-చాఎదీజ క్లబ్),లిటరరీ అండ్ ఎక్స్‌ట్రామ్యూరల్ క్లబ్ విద్యార్థి నిర్వాహకులు కె.హాసిని,మహమ్మద్ సమీఉల్లా ఖాన్,అలాగే అన్ని విభాగాల డీన్లు,విభాగాధిపతులు,కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ & పిఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకరా చారి మరియు 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు

# హనుమకొండలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆదేశానుసారం అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యార్థినుల ఉన్నత పాఠశాల లష్కర్ బజార్ లో హెచ్ పి వి వ్యాక్సినేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ మాట్లాడుతూ...ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వివిధ క్యాన్సర్లను నివారించడానికి,వ్యాధి సోకక ముందే దీర్ఘకాలిక రక్షణ కల్పించడం కోసం ప్రధానంగా 14 నుండి 15 సంవత్సరముల వయసుగల బాలికలను లక్ష్యంగా చేసుకొని హ్యూమన్ పాపిలోమా వైరస్ వాక్సినేషన్ గురించి,వివిధ సీజనల్ వ్యాధుల గురించి,పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించి సుమారు 55 మంది విద్యార్థినిలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ వేయడం జరిగిందని తెలిపారు.ఈ క్యాంపెయిన్ ఉద్దేశించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి మాట్లాడుతూ...ప్రభుత్వం చేపట్టిన ఇంత మంచి కార్యక్రమాన్ని ఇంకా మిగిలిపోయిన విద్యార్థినిలు అందరూ కూడా వ్యాక్సినేషన్ డ్రైవ్ ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామేశ్వరి,రాజేష్,భాను,అరుణ స్కూల్ ఉపాధ్యాయినీలు శ్రీదేవి రమాదేవి,శోభ,అరుణ,విద్యార్థినిల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు 4% రిజర్వేషన్ అమలు చేయాలి

## • విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర కమిటీ



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 5:** దివ్యాంగుల రోస్టర్ ప్రకటించి మినహాయింపు పోస్టులను స్పష్టం చేయాలి... ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల లో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 7437 పోలీసు శాఖ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాల్లో వికలాంగుల హక్కుల చట్టం2016 ( ఆర్ పి డబ్ల్యు డి ఆక్ట్ 2016 ) ప్రకారం దివ్యాంగులకు కల్పించాల్సిన 4 శాతం రిజర్వేషన్ ప్రకారం 300 పోలీస్ శాఖ ఉద్యోగాలను రోస్టర్ ప్రకారం దివ్యాంగుల 4 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.పోలీసు నియామకాల్లో ఏయే పోస్టులు దివ్యాంగులకు అనుకూలమో శాస్త్రీయంగా పరిశీలించి, చట్టబద్ధంగా దివ్యాంగుల రోస్టర్‌ను ప్రకటించాలి. అలాగే దివ్యాంగులకు అనుకూలం కాని పోస్టులు ఉంటే, వాటిని చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన మినహాయింపు ఉత్తర్వులతో ప్రకటించాలి. ఎలాంటి కారణాలు చూపకుండా దివ్యాంగులను పూర్తిగా నియామకాల నుండి దూరంగా ఉంచడం రాజ్యాంగ స్ఫూర్తికి, వికలాంగుల హక్కుల చట్టం2016కు విరుద్ధం.కాబట్టి తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు నియామక మండలి వెంటనే పోలీసు నియామక నోటిఫికేషన్‌ను పునఃసమీక్షించి, దివ్యాంగులకు 4% రిజర్వేషన్ అమలు చేస్తూ పోస్టుల వారీగా రోస్టర్‌ను ప్రకటించాలని, దివ్యాంగులకు అనువైన పోస్టులను గుర్తించి వారికి సమాన అవకాశాలు కల్పించాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేస్తోంది.డిమాండ్లు:వికలాంగుల హక్కుల చట్టం2016 ప్రకారం 4% రిజర్వేషన్‌ను పూర్తిగా అమలు చేయాలి.పోలీసు శాఖలో దివ్యాంగులకు అనువైన పోస్టుల రోస్టర్‌ను విడుదల చేయాలి. 7 437 పోస్టులలో దివ్యాంగులకు 300 పోస్టులు నింపి రాజనీతి నిరూపించుకోవాలి లేని పక్షంలో రాజ్యాంగ ప్రకారం ముందుకు సాగి దివ్యాంగులకు రిజర్వేషన్ సాధిస్తామని విశ్వ విద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలిపింది.దివ్యాంగుల హక్కులను పరిరక్షిస్తూ సమాన ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంతెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్ , విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంతెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ , జనరల్ సెక్రెటరీ ఆంజనేయులు గౌడ్, ,మొరిగాడి నరసింహ గౌడ్, మొక్క ఉపేందర్, , ధనమ్మ జనమ్మ, కర్ణాకర్ వెంకటేష్ జగన్, వెంకట్ దివ్యంగా విద్యార్థులు నాయకులు పాల్గొన్నారు

# ఎన్ఐటీ వరంగల్‌లో సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమం




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** జాతీయ స్థాయి సైబర్ జాగ్రూకత దివస్ కార్యక్రమమం సురక్షా కా తిరంగా మంత్ ఎండ్ ఛాంపియన్ కార్యక్రమంలో భాగంగా,నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ & వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా బుధవారం బోస్ హాల్‌లో సైబర్ జాగ్రూకత దివస్ అవగాహన కార్యక్రమం నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు,అధ్యాపకులు,సిబ్బంది,పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా,ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షత వహించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు,ఎన్ఐటీ వరంగల్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.ప్రధాన అతిథి ఎన్.శ్వేత, ఐపీఎస్ మాట్లాడుతూ...రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరస్థులు ప్రధానంగా భయం (ఖీముతీ), ఆశ (నశీజూవ),అత్యవసరత (ఖతీస్త్రవఅషవ) అనే మూడు భావోద్వేగాలను ఉపయోగించి మోసాలకు పాల్పడతారని,అలాంటి సందేశాలు వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా ధృవీకరించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.అలాగే సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని,ఎన్ఐటీ వరంగల్‌లో జరుగుతున్న కృత్రిమ మేధస్సు (ూ×) ఆధారిత సైబర్ భద్రత పరిశోధనలను అభినందించారు.ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి,డైరెక్టర్, ఎన్ఐటీ వరంగల్ మాట్లాడుతూ...సైబర్ భద్రతపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు.సైబర్ నేరాల నివారణకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఎన్ఐటీ వరంగల్‌లో త్వరలో సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.కృత్రిమ మేధస్సు ఆధారిత సైబర్ భద్రత,డీప్‌ఫేక్ గుర్తింపు వంటి రంగాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి పనిచేస్తామని తెలిపారు.రిజిస్ట్రార్ సునీల్ మెహతా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ,భవిష్యత్తులో కూడా సైబర్ భద్రత కార్యక్రమాలకు సంస్థ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు.ఎన్ఐటీ వరంగల్ పూర్వ విద్యార్థిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దారా కవిత,ఐపీఎస్,సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్,నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ వంటి సేవల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ రకాల సైబర్ మోసాలపై ఆడియో-విజువల్ ప్రదర్శనలు నిర్వహించగా,చివరగా పాల్గొన్న వారందరూ సైబర్ సెక్యూరిటీ ప్రతిజ్ఞ చేసి బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా వ్యవహరిస్తామని సంకల్పించారు.

# చౌరస్తా విస్తరణకు సహకరించిన వైసీపీ యువ నేత శీలం శ్రీను

## ప్రజాహితం కోసం విగ్రహం తొలగింపు.. గౌరవప్రద పునఃప్రతిష్ఠకు విజ్ఞప్తి




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 05:** చౌరస్తా విస్తరణకు సహకారం.. వైఎస్ఆర్ విగ్రహానికి గౌరవప్రద పునఃప్రతిష్ఠ కోరిన శీలం శ్రీను షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో వైఎస్ఆర్ విగ్రహం తొలగింపు అంశంపై వైసీపీ యువ నాయకుడు శీలం శ్రీను స్పందించారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన చౌరస్తా విస్తరణ పనులకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన తెలిపారు.ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విగ్రహాన్ని తొలగించే నిర్ణయానికి మద్దతు తెలిపినప్పటికీ, దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి పట్ల ప్రజల్లో ఉన్న గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని విగ్రహాన్ని తగిన గౌరవంతో పట్టణంలో అనువైన ప్రదేశంలో తిరిగి ప్రతిష్ఠించాలని అధికారులను కోరినట్లు చెప్పారు.ఈ విషయమై సంబంధిత అధికారులతో చర్చలు జరిపామని, విగ్రహాన్ని త్వరితగతిన కొత్త ప్రదేశంలో ఏర్పాటు చేస్తామని అధికారులు సానుకూలంగా స్పందించినట్లు శీలం శ్రీను వెల్లడించారు.పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని, అదే సమయంలో ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా విగ్రహ పునఃప్రతిష్ఠ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చౌరస్తా విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.


# ఆపదలో ఉన్న వారికీ అండగా ముద్దసాని కిరణ్ రెడ్డి



**తొలి అక్షరం/వలిగొండ ఆగస్టు 05:** మొగిలిపాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్యామల నరేష్ గారి అమ్మ గారు శ్యామల బుచ్చమ్మ ఈ రోజు అనారోగ్యంతో మరణించారు అని తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలమాల వేసి వారి కుటుంబానీ పరామర్శించి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బిక్షపతి, గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్,ఉప సర్పంచ్ షేక్ సైదులు,వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్,మచ్చ సునీత స్వామి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య మాజీ ఉప సర్పంచ్ భీమనబోయిన నరసింహ,మాజీ ఉప సర్పంచ్ విష్ణు చారి,పాల సంఘం డైరెక్టర్ సింగం మహేష్,మాజీ పాలసంగం చైర్మన్లు జక్క ఇంద్ర రెడ్డి,పబ్బు సత్తయ్య ,మద్ది పాండు రంగ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు జడిగే సత్యరాములు,ముద్దసాని శేఖర్ రెడ్డి,మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు జక్క శ్రీనివాస్ రెడ్డి,మచ్చ నవీన్,సింగం శంకరయ్య,జడిగే గోపాల్,ఉక్కుర్తి బిక్షపతి,మొగిలిపాక దుర్గయ్య,పబ్బు మల్లయ్య, పబ్బు నరసింహ, పబ్బు బాలకృష్ణ,చలిచీమల కృష్ణ,బీమనబోయిన మచ్చేందర్,గుండెపురి ఉపేందర్,జడిగే స్వామి,రాపోతుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

# నర్సింహులపేటలో జనరల్ బాడీ సమావేశం

## అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్




**తొలిఅక్షరం/నర్సింహులపేట ఆగస్టు 5:** నర్సింహులపేట మండల పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై నర్సింహులపేట ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులతో కలిసి మండలంలోని అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ, విద్య, వైద్యం తదితర అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

## త్వరలో అన్ని గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి

## పీసీసీ కోఆర్డినేటర్ అవేజ్ ఖాన్, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్



**తొలిఅక్షరం/నర్సింహులపేట, ఆగస్టు 5:** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో పార్టీ కమిటీల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని డోర్నకల్ నియోజకవర్గ పీసీసీ కోఆర్డినేటర్ అవేజ్ ఖాన్ అన్నారు. నర్సింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే అసలైన బలం అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీల ఏర్పాటును వేగవంతం చేయాలని నాయకులకు సూచించారు. గ్రామాల్లో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు, ప్రాధాన్యం కల్పిస్తుందని స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో అన్ని గ్రామ కమిటీల ఏర్పాటును పూర్తి చేసి, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, కాంగ్రెస్ సిద్ధాంతాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు పిలుపునిచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరోజు రాజశేఖర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బాబురావు, సర్పంచ్ పెద్దమాముల యాకయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహబూబ్ ఖాన్, బీసీ సెల్ అధ్యక్షులు గుండగాని వెంకన్న, సోషల్ మీడియా ఇన్చార్జ్ చిర్ర సతీష్, మండల యూత్ అధ్యక్షులు పొన్నం శ్రీకాంత్ వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ముప్పిపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ముప్పిపల్లి ఆలయానికి విద్యుత్ సదుపాయం

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్

**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 05:** జిల్లేడు చౌదరిగూడెం మండలంలోని ముప్పిపల్లి గ్రామ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు. ఆలయ విద్యుత్ సమస్యను గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పరిష్కరిస్తూ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచనల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి పనులు పూర్తి చేయించారు.ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, మార్కెట్ కమిటీ



డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, మ ండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిట్ట రజిత వెంకటయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. విద్యుత్ అధికారుల సమక్షంలో స్విచ్ ఆన్ చేసి ఆలయానికి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు.ఆలయ విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కారమవడంతో గ్రామస్థులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, ఆలయ పూజారి లక్ష్మీ నరసింహ, వెంకటేష్, సురేష్, శ్రీను, సోమయ్య, జంగయ్యతో పాటు పలువురు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన బిడ్డకు తల్లిపాలే తొలి రక్షణ ప్రపంచ తల్లిపాల వారోత్సవంలో అవగాహన"

**- తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ పోషణ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 05:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకుని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏరియా సబ్ సెంటర్'ఏ' అర్బన్ 2వ అంగన్వాడి కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి టీచర్ పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. శిశువు పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించి, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ గర్భిణులు అంగన్వాడి కేంద్రాల్లో అందించే బాలామృతం, గుడ్లు, పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే ఐరన్ మాత్రలను క్రమం తప్పకుండా వాడాలని చెప్పారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ ఆరిఫా బేగం, 20వ వార్డు కౌన్సిలర్ పి. గోపాల్, ఏఎన్ఎం ఇస్తేరాణి, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు

**కౌసల్యదేవిపల్లిలో బానోత్ కోటయ్య కుటుంబానికి రూ.2 వేల ఆర్థిక సాయం..**

**సేవా ట్రస్టు నుంచి మరో రూ.1,000 అందజేత**



**తొలి అక్షరం/నర్సింహులపేట ఆగస్టు 5:** నర్సింహులపేట, మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన బానోత్ కోటయ్య అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు అన్నంగి నరేష్-హరిచందన మాజీ వార్డు నెంబర్ కాంగ్రెస్ నాయకులు , కుటుంబం సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ.2 వేల నగదు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకులు కలిసి కౌసల్యదేవిపల్లి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మరో రూ.1,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో గ్రామస్తులంతా బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహితం కోసం వైఎస్సార్ విగ్రహాన్ని స్వచ్ఛందంగా తొలగించిన కాంగ్రెస్

- విగ్రహం కంటే ఆశయాలే గొప్పవి.. అభివృద్ధికి కాంగ్రెస్ సహకారం
- చౌరస్తా విస్తరణకు మార్గం సుగమం.. వైఎస్సార్ విగ్రహం తొలగింపు





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 05:** షాద్‌నగర్ పట్టణంలో చౌరస్తా విస్తరణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తి సహకారం అందించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని చౌరస్తాలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని స్వచ్ఛందంగా తొలగించేందుకు ముందుకొచ్చారు. మున్సిపల్ అధికారులు విగ్రహాన్ని తొలగించే సమయంలో అది అనుకోకుండా రెండు భాగాలుగా విరిగిపోవడంతో అక్కడున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భావోద్వేగానికి గురయ్యారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాలే ముఖ్యమనే ఉద్దేశంతో బాధను దిగమింగి అభివృద్ధి పనులకు సహకరించారు. "నాయకుడి విగ్రహం కంటే ఆయన ఆశయాలు గొప్పవి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పట్టణాభివృద్ధికి సహకరించడం వైఎస్సార్‌కు ఇచ్చే నిజమైన నివాళి" అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాహితానికి ప్రాధాన్యం ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు స్థానికులు అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సౌకర్యం కోసం తీసుకున్న ఈ చర్య పట్టణాభివృద్ధిపై తమ నిబద్ధతను మరోసారి చాటిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

# పిట్టలగూడలో ఘనంగా పోచమ్మమైసమ్మ బోనాలు.. అమ్మవార్లను దర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**తొలి అక్షరం/నందిగామ, ఆగస్టు 05:** నందిగామ మండలం పిట్టలగూడ గ్రామంలో గ్రామదేవతలైన పోచమ్మ, మైసమ్మ అమ్మవార్ల బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ నగర్‌కుంట నవీన్ రెడ్డి పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామాలు సుభిక్షంగా ఉండి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్, సర్పంచులు, మాజీ సర్పంచులు స్వప్న భూపాల్ రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్ పంతులు, యారం శేఖర్ రెడ్డి, బాబురావు, అజయ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# బీరప్ప గుడి స్థల వివాదం.. అన్ని వర్గాలతో చర్చించి పరిష్కారం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్లాట్ యజమానులు, గ్రామ పెద్దలు, భక్తులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని హామీ**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు05:** షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే వెంచర్స్‌లో బీరప్ప స్వామి గుడి స్థలానికి సంబంధించిన వివాదంపై వచ్చిన కథనాల నేపథ్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం వివాదాస్పద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం భక్తులు, స్థానికులు, సంబంధిత వర్గాలతో మాట్లాడి సమస్యపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీరప్ప స్వామి దేవాలయం కురుమ, గొల్లలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆరాధించే పవిత్ర స్థలమని పేర్కొన్నారు. వెంచర్ అభివృద్ధి సమయంలో దేవాలయ విస్తరణకు కొంత స్థలాన్ని కేటాయిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చినప్పటికీ, అది పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. దేవాలయాన్ని విస్తరించి 12 పిల్లర్లతో మూడు గర్భగుడులు నిర్మించేందుకు భక్తులు ముందుకు రాగా, ఆ ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు యజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యను రాజకీయాలకు అతీతంగా పరిష్కరిస్తామని స్పష్టం చేసిన వీర్లపల్లి శంకర్, ప్లాట్ యజమానులు, భక్తులు, గ్రామ పెద్దలు, కుల పెద్దలతో సమావేశం నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారి హక్కులు, భక్తుల మనోభావాలు రెండింటినీ గౌరవిస్తూ ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సామరస్యపూర్వక పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# షాద్ నగర్ చౌరస్తా విస్తరణకు కాంగ్రెస్ నిర్ణయం అభినందనీయం: ఆర్.ఎన్. రాము



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 05:** షాద్‌నగర్ చౌరస్తా విస్తరణలో భాగంగా వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించి ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల చౌరస్తా ఉద్యమ నాయకుడు ఆర్.ఎన్. రాము కాంగ్రెస్ నాయకత్వాన్ని అభినందించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజల ప్రాణాల రక్షణతో పాటు షాద్‌నగర్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. చౌరస్తా విస్తరణకు సహకరిస్తూ విగ్రహాన్ని తొలగించడం ప్రజాహితం పట్ల కాంగ్రెస్ నాయకుల నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. విగ్రహం తొలగింపు అంశంపై గతంలో తాను ఆవేశంలో చేసిన వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్లు ఆర్.ఎన్. రాము వెల్లడించారు. ప్రజా ప్రయోజనాల కోసం పార్టీ అధిష్ఠానం, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తీసుకున్న నిర్ణయాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేసిన ఆయన, షాద్‌నగర్ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

# శిరస్సున బోనం.. గుండెల్లో ప్రగతి ధ్యానం

- తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు
- ప్రజా సంక్షేమమే ధ్యేయం..ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తాం
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- తొర్రూరులో వైభవంగా ముత్యాలమ్మ బోనాలు







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో-తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),ఆగస్టు5:** పల్లె ప్రశాంతతను పులకరింపజేస్తూ, తంబూర నాదాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల సిగాలు, డప్పు చప్పుళ్ల హోరుతో తొర్రూరు పట్టణ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించు కున్నాయి. బోనాల పండుగ సందర్భంగా స్థానిక ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద భక్తి చైతన్యం వెల్లి విరిసింది. సంప్రదాయ సంస్కృతికి అద్దం పడుతూ ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవాలను బుధవా రం స్థానిక ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

### సంప్రదాయ భక్తితో ఎమ్మెల్యే బోనం:

ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూర్తి సంప్రదాయ వస్త్రధారణ ధరించి, శిరస్సుపై బోనం ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కుబడులు చెల్లించుకున్నారు. బోనాలు మన తెలంగాణ సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక. పాలకుర్తి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు, ఆ ముత్యాలమ్మ తల్లి కృపాకటాక్షాలతో ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా సంకల్పం. - యశస్విని రెడ్డి, పాలకుర్తి శాసనసభ్యురాలు

### ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రార్థనలు:

పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ సమగ్ర స్వరూపాన్ని, ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

### రైతన్నల సంక్షేమం:

కాలం కలసివచ్చి, సమృద్ధిగా వర్షాలు కురిసి, చేలు పచ్చగా పండాలని కోరుకున్నారు.

### యువతకు ఊతం:

స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు.

### ప్రభుత్వ పాలన:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారంజక పాలనతో మరిన్ని సువర్ణ అధ్యాయాలు లిఖించాలని అమ్మవారిని వేడుకున్నారు.

### ప్రగతి పథంలో పాలకుర్తి:

నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర వికాసానికి నిరంతరం శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రహదారులు, తాగునీరు, సాగునీటి వసతులు, నాణ్యమైన విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, యువతకు శిక్షణ-ఉపాధి వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

### అట్టహాసంగా సాగిన ఉత్సవం:

ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, మాజీ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, ముఖ్య ప్రముఖులు డాక్టర్ సోమేశ్వర రావు,గంజి విజయ్ పాల్ రెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మేకల కుమార్, యువజన నాయకులు రాజేష్ యాదవ్, మహేష్ యాదవ్,పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు మరియు మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.



# 'కరికాల'గా సందీప్ కిషన్..

## రెండు భాగాలుగా భారీ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం!

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన కథానాయకుడిగా 'కరికాల' అనే టైటిల్‌తో ఓ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం తెరకెక్కుతోంది. బుధవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ రాజసం ఉట్టిపడే అవతారంలో కనిపించారు. ఓ అడవిలో గుర్రంపై కూర్చుని, చేతిలో పదునైన కత్తి పట్టుకుని శక్తివంతమైన యోధుడిగా దర్శనమిచ్చారు. పక్కనే సింహంతో అతడి గంభీరమైన లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇది ఒక ఫాంటసీ చిత్రమని, భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృతమైన వరల్డ్ బిల్డింగ్‌తో దీన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. 'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. చాప్టర్-1ను 2027 జూలై 2న, చాప్టర్-2ను అదే ఏడాది అక్టోబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇదిలా ఉండగా, సందీప్ కిషన్ ప్రస్తుతం 'సిగ్మా' అనే మరో చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. తమిళ స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూలై 31న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు 'కరికాల' ప్రకటనతో సందీప్ తన కెరీర్‌లోనే ఓ భారీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్లు !

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం 'కొరియన్ కనకరాజు' విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న విడుదల కానున్న ఈ సినిమాను ఒకరోజు ముందుగానే, అంటే ఆగస్టు 6న పెయిడ్ ప్రీమియర్ల రూపంలో ప్రేక్షకులకు చూపించేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, అద్భుతమైన స్పందన లభిస్తుండటం సినిమాపై ఉన్న అంచనాలకు అద్దం పడుతోంది.ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. రేపు (ఆగస్టు 6) సాయంత్రం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు థియేటర్లలో ప్రత్యేక పెయిడ్ ప్రీమియర్లు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సినిమా కంటెంట్‌పై తమకు ఉన్న గట్టి నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ముందస్తు పాజిటివ్ టాక్‌ను సంపాదించుకోవడంలో కీలకం కానుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న ఈ హారర్-కామెడీ చిత్రంపై ముందు నుంచీ మంచి బజ్ ఉంది. విడుదలైన ట్రైలర్, టీజర్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. దీనికి తోడు తమన్ అందించిన సంగీతం కూడా శ్రోతలను ఆకట్టుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌కు అనూహ్య స్పందన వస్తోంది. ఆ వారం విడుదలవుతున్న ఐదు సినిమాల్లో 'కొరియన్ కనకరాజు'పైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రాజీవ్ రెడ్డి, సాయి బాబా జాగర్లమూడి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య, దక్ష నగార్కర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వరుస ఫ్లాపుల తర్వాత వస్తున్న ఈ సినిమాతో వరుణ్ తేజ్ గట్టి కమ్‌బ్యాక్ ఇస్తారని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రీమియర్ల తర్వాత వచ్చే టాక్, ఆయన కెరీర్‌కు ఎంతవరకు బూస్ట్ ఇస్తుందో చూడాలి.




# రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి.గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు.అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.



# ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?



కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది.2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది.

# తాను చదువుకున్న స్కూల్‌కు ధనుష్ అపురూప కానుక!

తాను చదువుకున్న పాఠశాలకు నటుడు ధనుష్ విలువైన కానుక అందించాడు. చెన్నైలోని సాలిగ్రామంలో ఉన్న తాయ్ సత్య మెట్రిక్యులేషన్ పాఠశాలకు మూడు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించి విరాళంగా ఇచ్చాడు. ఈ కొత్త భవనానికి 'ధనుష్ బ్లాక్' అని పేరు పెట్టడం విశేషం.ధనుష్ పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివాడు. ఇటీవల కొత్త భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ తన స్కూల్ సహచరుడు, సినిమాటోగ్రాఫర్ కుమరన్‌తో కలిసి హాజరయ్యాడు. ఇద్దరూ 1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు.ఈ సందర్భంగా ధనుష్ తన ఉపాధ్యాయులందరి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. వారితో కలిసి ఫొటోలు దిగాడు. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.ధనుష్‌తో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు కలిసి చదివిన కుమరన్, ఆయన భార్య లక్ష్మీ కృప కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుమరన్ మాట్లాడుతూ.. పదో తరగతి వరకు తాము ముగ్గురూ ఇదే పాఠశాలలో చదివామని చెప్పాడు. ఆ తర్వాత ధనుష్‌తో కలిసి మరో పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశానన్నాడు. ధనుష్ సినీ రంగంలోకి వెళ్లగా, తాను ఇంజినీరింగ్ పూర్తి చేసి తర్వాత సినిమాటోగ్రాఫర్‌గా మారినట్టు తెలిపాడు. 'తంగమగన్' వంటి చిత్రాల్లో ధనుష్‌తో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశాడు.పాఠశాల భవనాల పరిస్థితి గురించి తెలుసుకున్న ధనుష్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కొత్త భవనం నిర్మించారని కుమరన్ చెప్పాడు. అంతేకాదు, పాత భవనాలను పునరుద్ధరించడంతో పాటు ఖాళీ స్థలాల్లో మరిన్ని కొత్త భవనాలు కూడా నిర్మిస్తానని ధనుష్ హామీ ఇచ్చాడని వెల్లడించాడు. ఆయన చేసిన సాయం తమను ఎంతో కదిలించిందని అన్నాడు.ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ధనుష్ నటుడిగా ఒకటి, దర్శకుడిగా మరోటి ఇలా రెండు జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న 'ఓం' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు.




# 41 గంటలు నిర్విరామంగా షూటింగ్ లోనే కీర్తి సురేష్!

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పని గంటల వివాదం ఎంత సంచలనమైందో తెలిసిందే. సెట్ లో 8 గంటలు మించి పని చేయించుకోవడంపై చాలా మంది హీరోయిన్లు బాహాటంగా విమర్శలు చేసారు. పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని..అలాంటప్పుడు ఎందుకు? పని చేయాలని మరికొంత మంది నటీమణులు తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కీర్తి సురేష్ ఏకంగా 41 గంటల పాటు నిర్విరామంగా పనిచేసి పని తనకు భారం కాదని నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే..ఒకే సమయంలో పలు చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

ఇటీవలి కాలంలో విభిన్న భాషల్లో ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్న కీర్తి సురేష్ డేట్స్ సర్దుబాటు చేయడం కోసం ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించారు. ముఖ్యంగా ఒక పెద్ద ప్రాజెక్ట్ షూటింగ్ నుండి నేరుగా మరో సినిమా సెట్స్‌కు పరిగెత్తాల్సిన పరిస్థితుల్లో విశ్రాంతి లేకుండా పనిచేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో ఏకంగా 41 గంటలపాటు ఎలాంటి నిద్ర లేకుండా మెలకువగానే ఉంటూ షూటింగ్‌లలో పాల్గొన్నానని సంచలన నిజం బయటపెట్టారు. చాలా సందర్భాల్లో సెట్ లో 12 గంటలకు మించి పనిచేసిన సందర్భాలున్నాయన్నారు. సినిమా పరిశ్రమ బయట నుంచి చూసే వారికి గ్లామర్‌గా కనిపిస్తుందని కానీ తెర వెనుక నటీనటులు పడే శ్రమ, పడే మానసిక , శారీరక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిరంతరం ప్రయాణాలు చేస్తూ రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేయడం వల్ల ఒక్కోసారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. అయినప్పటికీ వృత్తిపై ఉన్న అంకితభావంతోనే ఇన్ని కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు కీర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ .. ఇతర ఇండస్ట్రీలలో నటీనటులు, సాంకేతిక నిపుణుల కోసం 8 గంటల పని గంటల నిబంధనను తీసుకురావాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి.

